ఇంటర్ విద్యలో ప్రభుత్వ కళాశాల హవా

- ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచిన విద్యార్థులు
- సిలబస్ సకాలంలో పూర్తిచేసి అనంతరం రివిజన్ బోధన
- మాక్ పరీక్షలు నిర్వహించి దోష నివారణకు చర్యలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల

కంబాలచెరువు: ప్రణాళికాబద్ధమైన కృషి, పట్టుదల ఉంటే ఉన్నత లక్ష్యాలను సాధించగలమని రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిరూపిస్తున్నారు. విద్యాబోధనలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిలిపేందుకు అధ్యాపకులు ఎనలేని కృషి చేస్తున్నారు. గత నెల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్వీఎల్ నరసింహం నేతృత్వంలో అధ్యాపకులు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులు, సౌకర్యాలను కల్పిస్తూ వారిని మరింత ప్రోత్సహిస్తున్నారు. ఆ కోవలో రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందుంది.

ఒకేషనల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు

కళాశాలలో జనరల్ విభాగంలో ప్రథమ సంవత్సరంలో 362 మందికి 198 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం 345 మందికి 242 మంది విద్యార్థులు పాసయ్యారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరంలో 359 మందికి 225, ద్వితీయ సంవత్సరంలో 290 మందికి 210 మంది విద్యార్థులు పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో నక్కా శ్రావణి సత్య 892 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు పొందింది. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో ఎంపీసీలో ఎం.ప్రవల్లిక 970 మార్కులు సాధించింది. బైపీసీలో జె.సౌమ్యశాలిని 982 మార్కులు, సీఈసీ గ్రూప్‌లో ఎం.యశశ్విని 942 మార్కులు సాధించి ప్రథమంలో నిలిచారు.

పెరిగిన ఉత్తీర్ణత శాతం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏటా ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది. ఈ ఏడాది జనరల్ విభాగంలో 55 శాతం, ద్వితీయ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యాకోర్సుల్లో ప్రథమ సంవత్సరం 63 శాతం, ద్వితీయ సంవత్సరం 72 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి



జూనియర్ కళాశాల విద్యార్థులను ఇంటర్ పరీక్షలకు పూర్తిగా సిద్ధం చేశాం. సిలబస్‌ను అనుకున్న సమయానికంటే ముందుగానే పూర్తి చేసి పాఠ్యాంశాలను తిరిగి రివిజన్ చేయించాం. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో మాక్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల అభ్యసనాస్థాయి తెలుసుకున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి దోషాల నివారణకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేలా చర్యలు చేపడుతున్నాం. కళాశాల ప్రిన్సిపాల్, బోధనా మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేశారు. అత్యుత్తమ ప్రతిభకనపర్చిన కళాశాల విద్యార్థులను ప్రభుత్వంతో పాటు ఆర్జేడీ, ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

– ఎస్ఎస్వీఎల్ నరసింహం, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

కేంద్ర ప్రభుత్వ కుల గణన నిర్ణయంపై హర్షం


సమావేశంలో పాల్గొన్న అస్క సభ్యులు

సీటీఆర్ఐ: 2021 జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అంబేడ్కర్ సేవా కేంద్రం (ఆస్క) వ్యవస్థాపక అధ్యక్షుడు గుబ్బల రాంబాబు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్క ఆధ్వర్యంలో ఐదేళ్లుగా అంబేడ్కర్ భావజాల వ్యాప్తి, అందరికీ చదువు, అభివృద్ధి, దేశం కోసం పనిచేయడం వంటి అంశాలపై విస్తృతంగా కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. దేశంలో 6,154 కులాలకు ఇంకా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికపరంగా ప్రాతినిథ్యం దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు ప్రాతినిథ్యం కల్పించాలన్న అంబేడ్కర్ ఆశయం నెరవేరడానికి చాలాకాలంగా పోరాటాలు, సామాజిక ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఈనెల 4వ తేదీ ఆదివారం స్థానిక మోడల్ కాలనీలో ఉన్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ భవనంలో ఉభయగోదావరి జిల్లాల కవులు, గాయకుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమ్మేళనం అనంతరం కవులను, గాయకులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు, అస్క ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు తదితరులు పాల్గొన్నారు.

కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రం చేపట్టాలనుకుంటున్న కులగణన పారదర్శకంగా నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కులగణన నిర్ణయాన్ని ఆమె స్వాగతించారు.ఈ జనగణన ద్వారా దేశంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. దాని ఆధారంగా సంక్షేమ పథకాలను అవసరమైన వారికి అందించగలమని అభిప్రాయపడారు.

దోమాడ బాధితులకు బియ్యం పంపిణీ


దోమాడలో బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: దోమాడలో నిరుపేదల ఇళ్లు కూల్చివేసి 9 రోజులు గడుస్తున్నా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అధికార పార్టీకి చెందిన నాయకులు వచ్చి బాధితులను పరామర్శించలేదని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. దోమాడ గ్రామంలో గృహాలు కోల్పోయిన బాధితులను మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బాధితుల పరామర్శకు రాకుండా ఇతర ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని దుయ్యబట్టారు.

పేదల ఇళ్ల కూల్చివేత దారుణం

ప్రతి పేదవాడికీ ఇంటి స్థలం ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలంచారన్నారు. ఆ ప్రకారం దోమాడలో 160 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఇంకా 40 మంది అర్హులున్నారన్నారు. ఎన్నికలు రావడంతో మిగిలిన వారికి పట్టాలు ఇవ్వలేకపోయామన్నారు. స్థానిక పేద ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రైవేటు లేఅవుట్‌కు అనుమతులు ఇవ్వాలని సూర్యనారాయణరెడ్డి అన్నారు. దౌర్జన్యంగా, తెల్లవారుజామున పేదల ఇళ్లు కూల్చి వేయడం దారుణమని ఆయన విమర్శించారు. మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ బాధితులకు న్యాయం కోసం ఈనెల 5న జరిగే చలో దోమాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జైభీమ్ భారత పార్టీ ప్రతినిధి ఎనుగుపల్లి కృష్ణ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో దోమాడ సర్పంచ్ మీనవల్లి శారదదేవి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ నాయకులు దొంకుబుర్ర కృష్ణ, డి.అప్పారావు, పంపన రమణ, నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి పాల్గొన్నారు.

కూలీలు, ట్రాక్టర్ల యజమానుల మధ్య ఘర్షణ


ముగ్గళ్ల ర్యాంపులో వాగ్వివాదానికి దిగిన ఇసుక ఎగుమతి కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు

సీతానగరం: అనధికార ముగ్గళ్ల ఇసుక ర్యాంపులో ట్రాక్టర్ల యజమానులు, కూలీల మధ్య గురువారం వివాదం రాజుకుంది. దీనితో రంగప్రవేశం చేసిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ర్యాంపును మూసివేశారు. వివరాల్లోకి వెళ్లితే ప్రభుత్వం అధికారికంగా వంగలపూడి ర్యాంపు నుంచి ఉచిత ఇసుకను తీసుకువెళ్లవచ్చని ప్రకటించింది. ప్రజాప్రతినిధుల అండదండలతో అనధికార రేవులైన సింగవరం, ముగ్గళ్ల రేవుల నుంచి ట్రాక్టర్లపై ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం వంగలపూడి రేవు నుంచి ఉచిత ఇసుక తీసుకుని వెళ్లవచ్చు. అయితే ట్రాక్టర్లపై గోకవరం, కోరుకొండ, రంగంపేట తదితరు దూర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ముగ్గళ్ల ర్యాంపులోకి కేవలం అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్లు మాత్రమే వెళ్లి ఇసుక తరలిస్తుంటాయి. ఇతర గ్రామాల ట్రాక్టర్లను ఈ ర్యాంపులోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. గురువారం కూలీలు ఇతర ప్రాంత ట్రాక్టర్లను రానివ్వాలని కోరారు. కేవలం ముగ్గళ్ల ట్రాక్టర్లకు ఇసుక ఎగుమతి ద్వారా రోజువారీ వచ్చే కూలీ నగదు సరిపోవడం లేదంటూ ఇసుక ఎగుమతులను నిలిపివేశారు. దీనితో ముగ్గళ్ల ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు కలసి కూలీలతో వాగ్వివాదానికి దిగారు. దీంతో కూలీలు ఇసుక ఎగుమతి చేసేది లేదంటూ భీష్మించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ వీఆర్వో చిన్నా, స్థానిక పోలీస్ సిబ్బంది ర్యాంపు వద్దకు చేరుకుని ఇసుక తవ్వకాలను నిలిపివేశారు.

జాతీయస్థాయి టార్గెల్‌బాల్ పోటీల్లో స్వర్ణపతకం


జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన విద్యార్థులు

చాగల్లు: గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు ఆగ్రాలో జరిగిన టార్గెట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ఆర్.నవ్య, ఇ.హారిక, జి.రోషిణి, శాంతి, డి.మౌనిక, దుర్గ స్వర్ణ పతకం సాధించినట్టు స్థానిక జెడ్పీ హైస్కూల్ పీడీ విజయలక్ష్మి తెలిపారు. వారి సాధనకు నఫీజ్ ఆర్థికంగా సహకరించారని ఆమె వివరించారు. పురుషుల విభాగంలో జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.విజయ్ రజత పతకాన్ని సాధించినట్టు ఆమె తెలిపారు. వారి విజయంపై హెచ్ఎం మోహన్‌కృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ గోపాలకృష్ణ, తల్లితండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కదం తొక్కిన కార్మికులు


కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ వద్ద మే డే వేడుకల్లో పాల్గొన్న హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి

ఘనంగా మేడే వేడుకలు

సీటీఆర్ఐ: ప్రపంచ కార్మికులారా ఏకం కండి అంటూ మేడే స్ఫూర్తితో రాజమహేంద్రవరం సీపీఐ జట్ల లేబర్ యూనియన్, ఏఐటీయూసీ, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం వేలాది మంది కార్మికులు కదం తొక్కడంతో రాజమహేంద్రవరం ఎరుపెక్కింది. పలు ప్రాంతాల్లోని కార్మిక వాడల్లో, జట్ల సంఘం సెక్షన్ల వద్ద ఉదయం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. జట్ల సంఘం కార్యాలయం వద్ద జెండాను తాటిపాక మధు ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జెండాను కుంద్రపు రాంబాబు ఆవిష్కరించారు. అనంతరం జట్లు లేబర్ యూనియన్ కార్యాలయం నుంచి మహా ప్రదర్శన ప్రారంభమైంది. స్థానిక రాజమహేంద్రవరం కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ దగ్గర ఎంఎస్ఆర్ ఆటోస్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి ఆటో యూనియన్ కార్మికులతో కలసి మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో జాతీయ కార్యదర్శి నారాయణ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు నర్సి, వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు టైసన్, 30 డివిజన్ ఎస్సీ నాయకులు కాంత సంజయ్ పాల్గొన్నారు. స్థానిక కోటగుమ్మం వద్ద ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్‌రావు ఆధ్వర్యంలో పారా సంస్థతో సంయుక్తంగా మేడే వేడుకలు నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో పలు చోట్ల మేడే వేడుకలు నిర్వహించారు.

కార్మిక విజయానికి సంకేతం మేడే

కడియం: కార్మిక లోకం సాధించిన ఐక్య పోరాటాలకు దక్కిన ఫలితం మేడే రూపమని ఏఐటీయూసీ సీనియర్ నాకులు పాకా మంగయ్య అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా న్విహించారు. ఈ సందర్భంగా మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని ఏపీ పేపర్‌మిల్స్ ఆవరణలో జరిగిన వేడుకల్లో మంగయ్య జెండాను ఆవిష్కరించారు. కార్మిక పోరాటాల ప్రాముఖ్యతను వివరించారు. మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటంతో హక్కులను సాధించాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు డీపీ నాయకుడు, పల్లి ప్రసాద్, యంవీ రామరాజు, వై. రవికుమార్, యం ప్రసాద్, సాంబ, సత్తార్, అడపా పరమేష్, యం రామారావు తదితరులు పాల్గొన్నారు. వేమగిరి, కడియం తదితర గ్రామాల్లోని పరిశ్రమల వద్ద కార్మికులు మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

నూతన లేబర్ కోడ్‌లను తిప్పికొట్టండి

ధవళేశ్వరం: కేంద్ర ప్రభుత్వం కార్మికులపై లేబర్ కోడ్‌లను రుద్దే ప్రయత్నం చేస్తోందని దీనిని కార్మికులు తిప్పి కొట్టాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గురువారం ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి రామకృష్ణ, ఎస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


హార్లిక్స్ ఫ్యాక్టరీ వద్ద మేడే వేడుకల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు


పేపరుమిల్లు వద్ద మేడే వేడుకలు


అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సందర్భంగా జెండా ఎగరేస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


ర్యాలీలో వివిధ వేషధారణల్లో కార్మికులు

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

కంబాలచెరువు: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యాలయం వద్ద యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మేడే వేడుకలు నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అరుణ్ కుమారి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొమ్మూరులోని సబ్‌స్టేషన్ వద్ద

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జగతా అచ్యుతరామయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికులకు రక్షణగా చట్టాలు


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జ్ బి.పద్మ

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విక్రం హాలులో గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ బి.పద్మ కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు వారి హక్కులు, సంక్షేమానికి రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులకు రక్షణగా ప్రత్యేక చట్టాలున్నాయని వివరించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్‌కే. జబీనా, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టీఎస్. కార్తీక్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు, కార్మిక శాఖ అధికారులు, గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు

కృష్ణమోహన్ సేవలు అభినందనీయం


కృష్ణమోహన్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్, సర్పంచ్‌లు, అధికారులు

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన తురగా కృష్ణమోహన్ సేవలు అభినందనీయమని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. కృష్ణమోహన్ పదవీ విరమణ సభ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, యాదల సతీష్‌చంద్రస్టాలిన్, డీఎల్‌డీవో రత్నకుమారి, డీడీవో కే.కిశోర్, ఎంపీడీవో రమేష్, వీడీవో సంఘం నాయకులు వెంకటరత్నం, కేవీ రాఘవులు, భమిడ మూర్తి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌వోల సమ్మె


కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మెలో చేస్తున్న సీహెచ్‌వోలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఏపీమిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల(ఎంఎల్‌హెచ్‌పీ), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌వోల నిరవధిక సమ్మె గురువారం నాల్గవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎంఏ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా సీహెచ్‌వోలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మానవహారం నిర్వహించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు


ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో యోగా శిక్షణలో చిన్నారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో యోగా, హ్యాండ్ క్రాఫ్ట్, పుస్తక పఠనం, లలిత సంగీతం భగవద్గీత పఠనం తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో బాలల బొమ్మల రామాయణం పుస్తకం చదివించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, శిక్షకుడు శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం, అల్లు రవి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వాకచర్ల

రాజానగరం: సీతారామపురానికి చెందిన వాకచర్ల విష్ణుమూర్తిని జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగిందని విష్ణుమూర్తి గురువారం తెలిపారు. ప్రస్తుతం బీజేపీలో పుష్కర డీసీ మెంబర్‌గా విష్ణుమూర్తి ఉన్నారు.

ప్రవీణ్ ప్రగడాల మృతిపై సమగ్ర విచారణ చేయాలి

సీటీఆర్ఐ: ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని గ్రేటర్ రాజమండ్రి క్రిస్టియన్ అసోసియేషన్ కన్వీనర్ గుళ్ల మార్టిన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ రాజమండ్రి క్రిస్టియన్ అసోసియేషన్ సంస్థ క్రైస్తవ హక్కులు పరిరక్షణ, దాడులను అరికట్టేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్థ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా స్వచ్ఛందంగా క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు పోరాడుతుందన్నారు. ఇటీవల ఏపీలో ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లాలో క్రైస్తవులపై ఎక్కువగా దాడులు జరుగుతున్నాయని అన్నారు. ప్రవీణ్ ప్రగడాల మరణాన్ని క్రైస్తవ లోకం హత్యగా భావిస్తోందని అన్నారు. సమావేశంలో గ్రేటర్ రాజమండ్రి క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు జి. సుధాకర్, ఆర్డర్ ప్రసాద్, ప్రవీణ్, చిట్టిబాబు, జీడీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

పునీత జోజప్ప శ్రామికవర్గానికి ఆదర్శం


బూరుగుపూడిలో పునీత జోజప్పకు తేరు ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్‌సీఎం క్రైస్తవులు

కోరుకొండ: క్రైస్తవుల ఆరాధ్యదైవం ఏసుక్రీస్తు సాకుడు తండ్రి, పునీత కార్మిక జోజప్ప శ్రామిక వర్గానికి ఆదర్శనీయుడని ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ మనోజ్‌కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో పునీత జోజప్ప శ్రామిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మేడేని పురస్కరించుకుని నిర్వహించిన ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న జోజప్ప దినోత్సవం మానవాళికి మనశ్శాంతిని ఇవ్వాలని ప్రార్థనలు చేశారు. మేడే వేడుకలను ఆర్‌సీఎం క్రైస్తవులు ఘనంగా నిర్వహిస్తారన్నారు. శ్రామికులు అధిక సంఖ్యలో ఉన్న బూరుగుపూడి చర్చికి కార్మిక జోజప్ప దేవాలయంగా నామకరణం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. తొలుత బూరుగుపూడిలోని చర్చి నుంచి మెయిన్‌రోడ్డు గుండా రామాలయంవీధి, కాలనీ, అంబేడ్కర్ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించారు. పునీత జోజప్పను దర్శించుకునేందుకు క్రైస్తవులు, స్థానికులు తరలివచ్చారు. అనంతరం చర్చిలో పాదర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులు బైబిల్ పఠనం చేయాలని, సహోదర ప్రేమను విస్తృతం చేయాలన్నారు. ప్రపంచంలో యుద్ధాలు సమసిపోయి శాంతి వర్ధిల్లాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్‌సీఎం క్రైస్తవులు నన్స్, ఉపదేసులు కొల్లి జాకబ్ రాజు, రాయి థోమాస్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు బ్లాక్ రైస్ బహూకరణ

రాజానగరం: ఐరన్, జింక్ వంటి పోషకాలతో నిండి, ఆరోగ్యానికి తోడ్పడే బ్లాక్ రైస్ (బీపీటీ 2841) బియ్యాన్ని రంగంపేటకు చెందిన అభ్యుదయ రైతు పోతుల పద్మారావు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సి.నాగమణికి గురువారం కానుకగా అందజేశారు. ఈ విషయాన్ని దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు తెలిపారు. మార్టేరులో గురువారం శాస్త్రవేత్తలు, రైతులతో సమావేశం నిర్వహించారని వెంకటనరసింహరావు తెలిపారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన


భవన నిర్మాణ పనులను పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.28.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రెండు భవనాలను వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ గురువారం పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. పరీక్షల నిర్వహణ, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కోసం ఈ రెండు భవనాలను నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతోపాటు నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని వీసీ సూచించారు.

నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలి

కోరుకొండ: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి తెచ్చిన 4 లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా పోరాడుదామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకటనాయుడు పిలుపునిచ్చారు. గురువారం కోరుకొండ రాఘవనగర్‌లో మేడే సందర్భంగా ప్రదర్శన, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎంతోకాలంగా పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చిందని అన్నారు. వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట దక్షిణ భారతదేశంలో జరుపుతున్న హత్యాకాండను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎర్ర జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జగన్నాథం నాగన్న, దాసరి వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.